# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# గట్టు తెగితే..

"నిశాంత్! ఏమయింది నీకు. నిన్నటినించీ అదోలా ఉన్నావు?" అడిగింది రచన భర్త నిశాంత్ ని.

ఆ మాట వినిపించినా , ఆమె ఎదురుగా కనిపిస్తున్నా నిశాంత్ మాట్లాడలేదు. అతనికి పట్టరాని కోపంగా ఉంది.

ఆమె ఎదురుగా కనిపిస్తోంది.. కానీ అతని కేమవుతోందో తనకే తెలీడం లేదు. ఒళ్ళు మండిపోతోంది..

ఒళ్ళు కాదు మనసు..కరక్ట్.. మండుతున్నది మనసే.. అసూయతో, చిరాకుతో..

అతనికి తన తప్పు తెలుస్తోంది, తెలిసింది..

కానీ ఒప్పుకోవడానికి అడ్డు వస్తోంది..

అహం.. నా అహం. నేననే అహం.

"నాకేమీ అవలేదు, నేను శుభ్రంగా ఉన్నాను. అవుతున్నది నీకు, గొప్పదానివవుతున్నావుగా అందుకు " అక్కసుగా అన్నాడు

విస్తుపోయింది రచన.. ఆమె చూపుల్లో మొదట ఆశ్చర్యం, ఆ తర్వాత చిన్నపాటి లీలామాత్రపు భయం.. 'అది అతనంటే కాదని అతనికీ తెలుసు.. అతనికేమయిందా?' అన్న భయమే..

" నిశూ!" అంది నెమ్మదిగా.. అదామె ప్రత్యేకత.. ఎప్పుడూ తన సంయమనం కోల్పోదు..

ఆ మాటకి అతనికి మరింత చిరాకు పెరిగింది..

" స్టాప్ ఇట్ రచనా" తలుపు గట్టిగా వేసి లోపల కూర్చున్నాడు..

అతనికి ఆలోచించాలనిపిస్తోంది, తీవ్రంగా, సమగ్రంగా ఆలోచించాలనిపిస్తోంది. తన తప్పుని తెలిసి, దాన్ని ఒప్పుకోవాలని అనిపిస్తోంది..కానీ మనసెక్కడా కుదురు లేకుండా తిరుగుతోంది.

బయట రచన పిలుస్తోంది. పలకాలనిపించలేదు..

స్తబ్దత.. తనమీద అతనికే కోపం. ఆమె మీద కోపం.

రచన అతని జీవితంలో ఒక భాగం కాదు, జీవితం..

దిద్దుకోవాలని తెలిసినా దిద్దుకోడానికి ఇష్టపడలేకపోతున్న స్థితి..

---------------------------.

'తలుపు తడదామా, వద్దా?' అని ఆలోచిస్తూ బయట పచార్లు చేస్తూ ఆలోచిస్తోంది రచన.

ఆమెకి నిశాంత్ ప్రవర్తన కొత్త కాదు కానీ ఈ మధ్య తరచుగా ఇలా ప్రవర్తించడంఅర్థం కావడం లేదు, రోజు రోజుకీ మారుతున్న ఆమెకి కొరుకుడు పడటం లేదు.

' ఇదెక్కడికి దారి తీస్తుందో? ' అని భయం ఆమెని వెంటాడుతోంది.

"నేను హెచ్. ఆర్ ప్రొఫెషనల్ ని.. నువ్వు టెక్నాలజీ ఉద్యోగివి.. నేను ఉద్యోగుల గురించిన చాలా వ్యక్తిగతమైనవీ, రహస్యంగా ఉంచాల్సినవి ఎన్నో విషయాలు ఉంటాయి. దానివల్ల నాకొక కేబిన్ ఉండడం అవసరం, అందువల్ల నాకు కేబిన్ ఇచ్చారు తప్ప, నేనేదో గొప్ప అని కానీ, నువ్వు తక్కువ అని కాదు కదా! "

ఇది చివరి సంభాషణ తామిద్దరిమధ్యా.

అసలిలాంటి చిన్న విషయం వాదోపవాదాలకి దారి తీస్తుందని కూడా ఆమె ఊహించలేదు.

ఇదొక్కటే కాదు,..

ఈ మధ్యకాలంలో ఇలాంటివెన్నో..

-----------------

ఈనాటిది కాదు తామిద్దరి పరిచయం..

ఎప్పుడో ఇంజనీరింగ్ కాలేజీలో ఉండగా కలిశారు తామిద్దరూ..

చూడగానే ఆకర్షించే రూపం నిశాంత్ ది. కాలేజి లో రచనకి రెండేళ్ళు సీనియర్. ప్రతీ దానిలోనూ ఎంతో చురుగ్గా ఉండే నిశాంత్ ని ఎవరైనా ఇష్టపడడం పెద్ద గొప్ప విషయం కాదు, రచన కి మినహాయింపు లేదు.

ఇద్దరివీ హాస్టల్స్ పక్క పక్కనే ఉండడం, బ్రాంచ్ ఇద్దరిదీ ఒకటే కావడం లాంటివన్నీ కలిసి వచ్చాయి. అలా సంవత్సరం తిరిగేసరికి ఇద్దరి స్నేహం గాఢం గా మారింది.

నిశాంత్ ప్రవర్తన లో అప్పుడప్పుడూ కనిపించే విపరీత ధోరణులు రచన చాలా త్వరలోనే గుర్తించింది. చిన్న విషయాలకి విపరీతంగా పొంగిపోయి, ఉత్సాహంగా ప్రవర్తించడం, అలాగే తనకి నచ్చని విషయం జరిగితే విపరీతంగా ఆవేశపడడం చాలా సహజంగా జరిగేది.

అప్పుడప్పుడు అది విపరీతమై పోకడలు పోవడం ఆమెని భయపెట్టేది కానీ ఇద్దరికీ చిన్నతనం కావడం వల్ల ఇద్దరికీ వాటి మీద అవగాహన లేదు, ఉండి ఉంటే ‘ బైపోలార్ డిసార్డర్’ లాంటి మానసిక స్థితి కి దగ్గరగా ఉండే మనస్తత్వం అయి ఉండచ్చు అని అర్థం అయి ఉండేది..

స్వతహాగా ఓపిక తక్కువ అతనికి అనుకునేది.

తనకి దక్కనిది ఎవరికైనా దక్కితే చిరాకు పడే అతన్ని చూసి అది అతను తననుకున్నది సాధించాలనుకునే మనస్తత్వం ఉన్నవాడుగా అనుకుంది.

తనతో ఎవరైనా చనువుగా మెలిగితే అతను అసూయ ప్రకటిస్తే అది తన మీద అంతులేని ప్రేమే గా అనుకునేది.

ఇంజనీరింగ్ పూర్తి కాగానే రచన ఆర్మీలో చేరడానికి ఉత్సాహ పడింది..

అప్పటికే జీవితాన్ని కలిసి గడపాలని నిర్ణయించుకున్నారు వాళ్ళిద్దరూ.. అందుకని నిశాంత్ కి చెప్పడం తన బాధ్యత అనుకుని మొదట అతనికే చెప్పింది..

" వాట్! ఆర్ యూ ఔట్ ఆఫ్ ఉవర్ మైండ్?" అంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అన్నీ నిర్ణయించుకుని నాకు చెప్పడం ఎందుకు? అన్నాడు..

తను అన్న దాంట్లో తప్పేమిటో ఆమెకి అర్థం కాలేదు

." వై? ఏం తప్పుంది దీంట్లో?" అంది రచన నెమ్మదిగా..

" ఆర్మీ అంటే ఎంత కష్టమో నీకు తెలుసా? హాయిగా జీవితాన్ని గడపకుండా కోరి కష్టాన్ని తెచ్చుకుంటాననంటే కోపం రాదా?" అన్నాడు మరింత కోపంగా.

" మా ఇంట్లో అందరికీ ఎందుకో మొదటినించీ దేశ సేవ అంటే చాలా ఇష్టం, మనం పుట్టిన భూమికి ఏదైనా చెయ్యాలని అనిపిస్తుంది నిశూ. చిన్నప్పటించీ నేను ఎన్. సీ.సీ లో చేరింది కూడా అందుకే. దాన్ని కొనసాగించాలని చిన్న ఆశ. కొన్నాళ్ళు ప్రయత్నిస్తాను., నువ్వు పై చదువులు చదవాలని అనుకుంటున్నావు కదా, ఆ టైం వరకూ, మనం మన భవిష్యత్తు గురించి నిర్ణయించుకునే వరకూ నేను ఆర్మీ లో పనిచేస్తాను" అంది.

ఆమె అలా చెప్పిన తర్వాత వారం రోజులవరకూ నిశాంత్ చాలా కోపంగా ఉన్నాడు. మొదటి రెండు రోజులూ కలవలేదు కూడా, ఆ తర్వాత కలిసినప్పుడు కూడా అతని కోపం అలాగే కొనసాగింది. ఎంతో ఓపిగ్గా ప్రవర్తించి అతన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. రచనకి సహనం చాలా ఎక్కువ.

అది మొదలు ఎన్నో రకాల సంఘటనలు.

ఎన్నున్నా రచనంటే విపరీతమైన ఇష్టం అతనికి. అందువల్లే వాళ్ళ స్నేహం, ప్రణయం కొనసాగింది.

ఆర్మీలో ఉండగా రచన మరింత సహనం అలవర్చుకుంది, చాలా విషయాల్లో శిక్షణ పొంది తన వ్యక్తిత్వాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

ఈలోపున నిశాంత్ ఎం.టెక్ పూర్తి చేసుకుని ఉద్యోగం లో స్థిరపడ్డాడు.

ఇరువైపులా పెద్దల అంగీకారంతో ఒక ఇంటివారయ్యారు..

" అక్కా, నీకు నిశాంత్ గురించి పూర్తిగా తెలుసు, ఐ థింక్ నువ్వు రిస్క్ చేస్తున్నావేమో!" తమ్ముడు అమిత్ హెచ్చరించాడు రచనని..

" నువ్వన్నది రైటేరా అమిత్, కానీ ఇన్నేళ్ళుగా మరో అమ్మాయిని కన్నెత్తి చూడకుండా నాకోసమే వేచి ఉన్నాడు, నేనే లోకం గా అనుకుంటున్నాడు.."

“అందుకని కరిగి పొయావు,, అంతేనా? “ అక్కని వెక్కిరించాడు అమిత్.

ఒకసారి కౌన్సిలర్ ని కలిస్తే మంచిదని అక్కతో చెప్పాడు అమిత్. కానీ రచన పెద్దగా పట్టించుకోలేదు.

మొదటి సంవత్సరం పెద్ద సంఘటనలేమీ లేకుండా ప్రశాంతంగానే గడిచింది. అప్పుడు రచన దూరవిద్యలో ఎం.బి.యే చేద్దామనుకుంది..

" మనం ఫేమిలీ స్టార్ట్ చేస్తే బావుంటుంది కదా, ఇప్పుడీ చదువెందుకు? అన్నాడు నిశాంత్.

అప్పుడే ఫేమిలీ ఎందుకు నిశూ? మనమే ఇంకా చిన్నవాళ్ళం. ఆర్మీలో మానేసి మాములు ఉద్యోగం లో చేరి దూరవిద్యలో ఎం.బి.యే చేద్దామనుకుంటున్నాను, ఈ ఎం.బియే చేస్తే నా ఆర్మీ శిక్షణ కి తోడుగా హెచ్. ఆర్ లో ఉద్యోగం చేస్తే చాలా బావుంటుంది. ఆపైన ఫేమిలీ ని ప్లాన్ చేసుక్కోవచ్చు అంది..

“ఎప్పుడూ నీ మాటేనా?” అంటూ పెద్ద గొడవ పెట్టాడు.

దాంతో ఉద్యోగం మానేద్దామనుకున్న నిర్ణయం అమలుపరిచి, పాప పుట్టిన మూడునెలలకి మొదలుపెట్టి తను అనుకున్న కోర్స్ పూర్తి చేసుకుంది రచన.

పాపకు ఏడాది నిండుతూ ఉండగా నిశాంత్ కంపెనీలోనే హె.చ్ ఆర్ విభాగం లో ఉద్యోగం వచ్చింది రచనకి.

ఎగిరి గంతేసి కుటుంబం లో అందరినీ పిలిచి పార్టీ ఇచ్చాడు నిశాంత్.

" హాయిగా ఇద్దరం కలిసి వెళ్ళి, కలిసి వచ్చేయచ్చు" అంటూ ఆనందపడిపోయాడు.

అతని సంగతి తెలుసు కనక రచన నవ్వి ఊరుకుంది. తనకీ సంతోషంగానే ఉంది నిజానికి.. ఇద్దరూ చెరోమూలలకి వెళ్ళి పని చేసుకునే బదులు ఇదీ బానే ఉంటుందని..

కొత్త ఉద్యోగం లో త్వరగానే కుదురుకుంది రచన.

ఇద్దరూ కలిసి పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ చేసి మధ్యహ్నం భోజనానికి కేరీలు సర్దుకుని బయలుదేరేవారు. అప్పుడప్పుడు రచన డ్రైవ్ చేసినా ఎక్కువగా నిశాంతే చెయ్యడానికి ఇష్టపడేవాడు. పన్నెండు నలభై ఐదుకి మెసేజ్ పంపేవాడు, లంచ్ అయి, కాసేపు నడిచి మళ్ళీ ఎవరి పనులు వాళ్ళు చేసుకుని, సాయంత్రం కలిసి వచ్చేవారు.

కొన్నాళ్ళయ్యాకా రచన అంది." మనం లంచ్ ఎవరి టీం తో వాళ్ళు కలిసి చేస్తే బావుంటుంది నిశాంత్ ' అని..

" అంతే నా కంపెనీ బోర్ కొట్టేసిందా నీకు? అవున్లే!" అంటూ మొదలుపెట్టబోతున్న అతన్ని ఆపుతూ

" ప్లీజ్ నిశాంత్.. రోజంతా కలిసి ఉంటాం, పొద్దున్న, రాత్రి కలిసి భోచేస్తున్నాం. మధ్యాహ్నం కనీసం ఎవరి టీములతో వాళ్ళు ఉంటే కనీసం కొత్త విషయాలు తెలుస్తాయి. అంతకన్నా ఇందులో ఏమీ లేదు. అప్పుడప్పుడు ఎలాగూ కలిసే అవసరాలు, అవకాశాలు వస్తూనే " అంది గట్టిగా..

అతనికి నచ్చలేదన్న విషయం తెలుసుతోంది, దాచే ప్రయత్నం ఏమీ చెయ్యడు కనక..

అలా ఓ రోజు ఎండా, మరో రోజు నీడా అన్నట్టుగా నడుస్తోంది వాఇ సంసారం.

అతని మానసిక స్థితి గురించి ఆమెకు తెలుస్తోంది, ఎవరిదగ్గరకైనా తీసుకెల్దామంటే వచ్చే రకం కాదు, ఏం చెయ్యాలో తెలీని స్థితిలో ఉంది ఆమె.

అతని తల్లి తండ్రులు ' వాడికి కొంచం కోపం ఎక్కువమ్మా, నీకు తెలీనిదేముంది? నువ్వే కొద్దిగా సర్దుకోవాలి. తన సమవయస్కుల్లో ఎవరికి ఏది తనకన్న అముందు జరిగినా వాడికి తనకి జాగలేదని బాధపడతాడు, తను కూడా సాధించేవరకూ తపన పడతాడు అంతే! ' అంటారు తప్ప మరో మాట అనరు, అననివ్వరు.

ప్రోజెక్ట్ మేనేజర్ గా ప్రమోషన్ వచ్చింది నిశాంత్ కి. ఊటీ, కొడైకనాల్ యాత్రకి తీసుకెళ్లాడు

ప్రమోషన్లు సరి అయిన సమయం లో వచ్చి రచన తమ విభాగానికి హెచ్ ఆర్ హెడ్ గా ఎదిగింది.. దాంతో అతనికి తనకి వచ్చిన ప్రమోషన్ చిన్నదిగా అనిపించసాగింది. దాంతో అడపా తడపా దానిగురించి గొడవలు వచ్చేవి.

రచనకి మొదట టీము లీడ్ గా ప్రమోషన్ వచ్చినప్పుడు వజ్రాల చెవి దిద్దులు, ఉంగరం లాంటి కానుకలిచ్చి సంతోషించిన అతనికి ఇప్పుడు ఆమె విభాగానికి అధిపతి కావడం ఎందుకో తెలియని అసూయని రగిలించింది.

తన మనసులోని అసూయని ఏదో ఒక రూపం లో ప్రకటించి గొడవ పెట్టేవాడు. అది పెద్ద విషయమా, చిన్న విషయమా? అన్నది అతనికి పట్టేది కాదు..

అలా పెట్టిన గొడవే కేబిన్ విషయం. తనకి కేబిన్ లేదని, ఆమెకి ఇచ్చారని అతనికి కోపం..

ఇలా ఓ కేబిన్ లాంటి చిన్న విషయంలోప్రవర్తించడం ఆమెకి చాలా బాధగా ఉంది.

ఏం చెయ్యాలో తెలీక తలుపుకివతల ఆమె, ఆవేశాన్ని తగ్గించుకోవడానికి బోనులో పులిలా అతనూ ఓ గంట గడిపారు.

ఆ తర్వాత నెమ్మదిగా తలుపు తీసుకుని బయటకు వచ్చాడు నిశాంత్.

" రచనా, సారీ" అన్నాడు ఏ భావమూ లేకుండా..

అక్కరలేని విషయాలని పెంచడం వల్ల వచ్చేదేమీ లేదు, అందుకే చిరునవ్వుతో ' ఇట్స్ ఓకే ' అంది..

అలా ఆరోజు గొడవ ముగిసినట్టయింది..

" అక్కా, ప్రతీ సారీ నువ్వే ఎడ్జస్ట్ అయ్యే పరిస్థితి తెచ్చుకోకు.." తమ్ముడి హెచ్చరిక వినిపిస్తూనే ఉంది.

తన విభాగం లో ఆరు వందలమంది విషయాలని స్వయంగా ఒంటిచేత్తో చూసుకునే తనకి ఒక్క వ్యక్తి విషయం లో ఇలా జరగడం ఆమె కి చెప్పలేనంత బాధగా ఉంటోంది.

ఎప్పుడెలా ఉంటుందో తెలీని అతని మూడ్ తప్ప మరే విషయం లోనూ నిశాంత్ తో సమస్య లేదు, కానీ అదే బొత్తిగా పరిష్కారం లేనిదిగా తయారవుతోంది రోజు రోజుకీ.

తనదే తప్పని తెలుసుకున్నాడు కనక మరికొన్నాళ్ళు ప్రశాంతంగానే గడిచింది.

ఎన్నాళ్ళుంటుందో ఇలా? అని రచన అనుకున్నట్లే వచ్చింది ఆ రోజు..

ఆఫీస్ లో వార్షికోత్సవం జరిగింది..

ఆరోజు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారందరికీ అవార్డ్ లు ఇచ్చారు. వచ్చిన వారిని మాట్లాడమని అడిగారు.. అవార్డ్ అందుకున్న వాళ్ళలో చాలా మంది రచన ని తమ అవార్డ్ కి కారణమయిన వారిలో పేర్కొన్నారు.

ఒకబ్బాయి అయితే ' ఇది నా మొదటి ఉద్యోగం, చిన్న ఊరినించి వచ్చిన నాకు అన్నీ కొత్తగా ఉండి మొదట్లో నేను పని మీద ధ్యాస పెట్టలేకపోయేవాడిని. నా ఇంగ్లీష్ కూడ అంతంత మాత్రంగా ఉండేది, దాంతో ఎవరితోనైనా మాట్లాడాలన్నా జంకుగా ఉండేది. అలాంటప్పుడు రచనా మేడం నన్ను పిలిచి నాకెన్నో మంచి విషయాలు చెప్పి నాలో ధైర్యాన్ని నింపారు, ఇంగ్లీష్ నేర్పే కార్యక్రమాలు నిర్వహించారు. నా మేనేజర్ దగ్గరుండి పని నేర్పించారు. వీరి వల్ల నేనీ రోజు అవార్డ్ అందుకోగలిగాను" అంటూ చెప్పాడు..

ఆ రోజు రాత్రి నిశాంత్ పెద్ద గొడవ పెట్టుకున్నాడు రచనతో. వాడికి పని నేర్పింది నేను, ఊరికే మేనేజర్ అని చెప్పి ఊరుకున్నాడు, కనీసం పేరైనా చెప్పలేదు నాది. అదే నిన్నైతే ఏదో గుళ్ళో దేవతవైనట్టు పొగిడాడు, ఇడియెట్" అంటూ

పక పకా నవ్వింది రచన..

“అది అతని అభిప్రాయం, దానికి నేనేం చెయ్యను?” అంది చిరునవ్వుతో..

అసలే కోపంతో రగిలిపోతున్న నిశాంత్ ఆమె నవ్వు చూసి శివాలెత్తిపోయాడు. ఆ ఆవేశంలో ఆమె గురించీ, ఆ అబ్బాయి గురించీ తప్పుగా మాట్లాడాడు. మాట తూలడం చాలా తేలిక, అది చేసే నష్టం మాత్రం ఒక్కోసారి చెప్పలేనంత ఘోరంగా ఉంటుంది..

" ప్లీజ్ నిశాంత్" ఆవేశంగా మాట్లాడుతున్న అతన్ని చెయ్యెత్తి ఆపమన్నట్టు సైగ చేసింది..

" ప్లీజ్ షట్ అప్ నిశాంత్. ఒక్క మాట ఎక్కువ మాట్లాడితే బావుండదు. ఇన్నాళ్ళూ నువ్వే విషయం మీద గొడవ చేసినా నేను మాట్లాడలేదు, సహనం వహించి ఊరుకున్నాను.కానీ ఇప్పుడు నువ్వన్న విషయం మాతం వినడం, భరించి ఊరుకోడం నావల్ల కాదు.

ఇప్పటికి నీకు కూడా తెలుసు నీ విషయం, ఎన్నో సార్లు చెప్పి చూశాను.. నీకు సహాయం అవసరం కౌన్సిలింగ్ అవసరం.

అది తెలిసినా నువ్వు ఒప్పుకోలేవు.. నీకెవరైనా చెప్తే నచ్చదు. నీకు దగ్గరున్నవాళ్ళు సహనంతో నిన్నర్థం చేసుకునేలా ప్రవర్తిస్తే ఫలితం ఉంటుందని తెలుసుకుని నేను అలాగే ఉండడానికి ప్రయత్నం చేశాను. కేవలం నీ పేమకోసం, మన పాప కోసం.

ప్రమోషన్, కేబిన్, లంచ్ చెయ్యడం, త్వరగా వెళ్ళవలసి రావడం, రాత్రి లేట్ అవడం అన్నీ సమస్యలే నీకు.

నీకు సంతోషం కలిగించేది మాకూ సంతోషం కలిగించాలి, లేనివి లేదు.. ఇవన్నీ నేనెప్పుడూ పెద్ద సమస్యలుగా భావించలేదు. నా వాళ్ళు హెచ్చరించినా లెక్క చెయ్యలేదు. నువ్వు నా గురించి ఇంత అసహ్యంగా మాట్లాడితే మాత్రం నేను ఊరుకోలేను

సరస్సులో రాళ్ళేస్తే నిశ్చలంగా ఉన్న నీటిలో అలజడులే వస్తాయి, అదే గట్టు తెగితే మాత్రం వరదే. అంతవరకూ రాకుండా చూసుకోవడం మన బాధ్యత, అది తటాకమైనా, సంసారమైనా ఒకటే.

ఇప్పుడే నేను పాపని తీసుకుని మా ఇంటికి వెళ్ళిపోతున్నాను. అమిత్ చెప్పినట్టు మొదటిసారే నేను ఇలా నీకు చెప్పి ఉంటే విషయం ఇంత దూరం వచ్చేది కాదేమో. నీకు నచ్చినట్టు నువ్వు జీవించవచ్చు..” పాపని తీసుకుని గడప దాటింది రచన..

Click here to share your comments on this story